# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

| సంపుటి : 01 | సంచిక : 166 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 15 మే 2026 | పేజీలు : 4 |
|---|---|---|---|---|




పేదల సంక్షేమానికే
**పెద్దపీట**
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

3



# మైనార్టీలకు వరం టేమ్రిస్

- ఉత్తమ ఫలితాలు.. సకల సౌకర్యాలు
- నాణ్యమైన విద్య, కార్పొరేట్ వసతి
- ఐదుసార్లు నమాజ్... ప్రత్యేక అరబి శిక్షణ
- మైనార్టీల దృష్టి టేమ్రిస్ వైపు


4లో

# 'జనగణన'లో అందరూ భాగస్వాములు కావాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జనగణన 2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, జనాభా గణన, గృహ బాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం నర్మెటలో క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి, హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే) ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన వివరాలను అందించాలని సూచించారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయాని.. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందన్నారు. జనగణన ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, జనగణనలో భాగస్వామ్యులు అయ్యే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు. ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ సూచించారు.





# కంకర పోశారు.. వదిలేశారు..

- **రఘునాథపల్లి–కంచనపల్లి రహదారిపై ప్రయాణం నరకప్రాయం**

**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** రఘునాథపల్లి నుంచి కంచనపల్లి వెళ్లే ప్రధాన రహదారి అధికారులు నిర్లక్ష్యంతో ప్రమాదకరంగా మారింది. గుంతలు పడ్డ చోట బీటీ రోడ్డును తవ్వి కంకర పోసి నెలలు గడిచినా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర రహదారి కారణంగా వాహనాలు జారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించే అంబులెన్స్‌లు వేగంగా వెళ్లలేకపోతున్నాయి. బాలింతలు, వృద్ధులను ఈ మార్గంలో తీసుకెళ్లడం కష్టంగా మారింది. విద్యార్థులు కూడా సైకిళ్లు, బైకులపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును అసంపూర్తిగా వదిలేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## చౌడారం స్కూల్‌లో 'మన ఊరు మనబడి'

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలంలోని చౌడారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 'మన ఊరు -మనబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## 'పూలే' ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**జనగామ, మన చౌరాస్తా :** సావిత్రిబాయి పూలే ఫౌండేషన్, ప్రెస్టన్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్మీ, నేవీ, వాయుసేన, కానిస్టేబుల్, పారా మిలిటరీ ప్రవేశ పరీక్షలకు నాలుగు నెలల ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ యాసారపు కరుణాకర్ తెలిపారు. ప్రెస్టన్ ప్రాంగణంలో ప్రారంభమయ్యే ఈ శిక్షణను మాజీ ఆర్మీ అధికారులు, కోచ్‌లు నిర్వహిస్తారని చెప్పారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు కోటా ఇవ్వాలి

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా, పింఛన్ మొత్తాన్ని పెంచకుండా పింఛన్ దారులకు అన్యాయం చేస్తోందని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, ఉపాధ్యక్షుడు బిర్రు నగేష్ విమర్శించారు. జనగామలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే పింఛన్ మంజూరు చేసి పెంచిన మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు బస్సుల్లో పూర్తి ఉచిత ప్రయాణం కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రత్యేక కోటా ఇవ్వాలని కోరారు. జిల్లాకు కేటాయించే త్రీ వీలర్లు, సహాయక పరికరాల సంఖ్యను పెంచాలని, జీవనోపాధి కోసం ప్రభుత్వ పథకాల ద్వారా రాయితీలు, రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.





## సర్కార్ బడుల్లో బ్రేక్ ఫాస్ట్

**జనగామ, మన చౌరాస్తా :** 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా కుందారం గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మెగా పీటీఎం సమావేశంలో ప్రధానోపాధ్యాయులు బిట్ల రవిశంకర్ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఉచిత నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, రెండు జతల యూనిఫార్మ్స్, వారానికి మూడు కోడిగుడ్లతో కూడిన పౌష్టికాహార మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య కోసం ఐఎఫ్‌పీబీ బోర్డులు, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ఐ గంగసాని రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో కంప్యూటర్ విద్య బోధన జరుగుతోందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బ్రేక్‌ఫాస్ట్, టై, బ్యాడ్జ్, బెల్ట్, షూస్‌తో కూడిన కిట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. బాలికలకు కరాటే శిక్షణతో పాటు విద్యార్థుల శారీరక-మానసిక అభివృద్ధికి క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ కొంగరి సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికారంతోనే సామాజిక మార్పు

**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** బీసీల రాజ్యాధికారంతోనే సామాజిక మార్పు సాధ్యమని బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్రకు రఘునాథపల్లిలో విశేష స్పందన లభించింది. గురువారం మండలానికి చేరుకున్న పాదయాత్రకు స్థానిక నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు భారీగా తరలివచ్చి మద్దతు తెలిపారు. మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు గౌడ్, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి యాత్రకు సంఘీభావం ప్రకటించి రాఘవేందర్ గౌడ్‌ను సన్మానించారు. బీసీల ఐక్యతను బలపరిచే ఈ యాత్ర భవిష్యత్తులో రాజకీయంగా వారి వాటాను సాధించేందుకు దోహదపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.



## వల్లాల ఉప్పలయ్యకు పెరుమాండ్ల నివాళి

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా:** స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన వల్లాల ఉప్పలయ్య (భక్త రామదాసు) మృతి పట్ల బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఇప్పగూడెంలో ఉప్పలయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బాచిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.





# పేదల సంక్షేమానికే అగ్రతాంబూలం


■ **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కడియం శ్రీహరి పేర్కొన్నారు. గురువారం స్టేషన్ ఘనపూర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన 79 మంది లబ్ధిదారులకు రూ.26,90,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తోందన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ప్రతి నెల సుమారు 200 కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం అందుతున్నట్లు తెలిపారు. రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరా కుటుంబ బీమా పథకం, అర్హులైన వితంతువులకు రెండు లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్‌లో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రిని ఈ ఏడాది డిసెంబర్ 31లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నిర్బంధాన్ని ప్రశ్నించిన నేత రాములు

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలపై జరుగుతున్న హక్కుల ఉల్లంఘనలను ప్రశ్నిస్తూ పోరాడిన మానవ హక్కుల నేత డాక్టర్ బుర్ర రాములు అని వక్తలు పేర్కొన్నారు. ఖిలా వరంగల్ కోట సెంటర్‌లో ఆయన 15వ యాది సభను మానవ హక్కుల వేదిక నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ బుర్ర రాములు విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల భావాలతో పనిచేసి మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారని తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.





## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**జనగామ, మన చౌరాస్తా:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జనగామ మండలం శామీర్‌పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్నారని, ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. పదో తరగతిలో మొదటి, రెండో స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించి అభినందించారు.

# తుమ్మల 40 ఏళ్ల మంత్రి పదవి వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యాపారులు, హమాలీలు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వరకు మంత్రి తుమ్మల రైతుల సంక్షేమం కోసం అనేక సేవలు అందించారని తెలిపారు. మంత్రి సేవలను గుర్తిస్తూ వ్యాపారులు, హమాలీలు, రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రంజిత్ రావు, డైరెక్టర్ నాగబండి రవీందర్, సూపర్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## జనగామ కలెక్టర్ తీరు బాగాలేదు..

■ **ఎమ్మెల్సీ కోదండరాంకు సాదిక్ అలీ కంప్లయింట్**

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కలెక్టర్ వ్యవహార శైలి నియంతృత్వంగా ఉందని ఆరోపిస్తూ జనగామ కలెక్టర్ బాధితుల రక్షణ కమిటీ కన్వీనర్ సాదిక్ అలీ ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ వైఖరి కారణంగా ప్రజలు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బాధితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని కోదండరాం తెలిపారు.



## టెన్త్ స్టేట్ ర్యాంకర్ అక్షరసాయికి అభినందన

**జనగామ, మన చౌరాస్తా :** పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించిన జీవిలికపల్లి అక్షరసాయిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అభినందించారు. జనగామలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అక్షరసాయి, ఆమె తల్లిదండ్రులు రాంచందర్, కవితలను పుష్పగుచ్ఛంతో సత్కరించారు. 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి తెలుగు, హిందీ, గణితంలో వందకు వంద మార్కులు పొందిన ఆమె ప్రతిభను ఎమ్మెల్యే ప్రశంసించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే గొప్ప ఫలితాలు సాధ్యమని ఆమె నిరూపించిందన్నారు.



## కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీకి దరఖాస్తుల స్వీకరణ

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం నూతన కమిటీకి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ విభాగం పరిశీలకులు చేపూరి చిరంజీవి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గనిపాక మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తూ ఎస్సీ విభాగంలో బాధ్యతలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మైనార్టీలకు వరం టేమ్రిస్

- ఉత్తమ ఫలితాలు.. సకల సౌకర్యాలు
- నాణ్యమైన విద్య, కార్పొరేట్ వసతి
- ఐదుసార్లు నమాజ్... ప్రత్యేక అరబి శిక్షణ
- మైనార్టీల దృష్టి టేమ్రిస్ వైపు

**హనుమకొండ, మన చౌరాస్తా :**

తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ టేమ్రిస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీ విద్యాసంస్థలు మైనార్టీ విద్యార్థులకు వరంగా మారాయి. తెలంగాణ వ్యాప్తంగా 2016లో స్థాపించబడ్డ మైనార్టీ విద్యాసంస్థల్లో అనుభవం, అంకితభావం గల అధ్యాపకులు, ఉపాధ్యాయులచే నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను బోధిస్తుండడంతో ప్రతి సంవత్సరం అద్భుత ఫలితాలను రాష్ట్రస్థాయి ర్యాంకులను విద్యార్థులు సాధిస్తున్నారు. టేమ్రిస్ సెక్రెటరీ షఫీ ఉల్లా ప్రత్యేక చొరవతో ప్రతి ఏటా ఇంజనీరింగ్, నీట్ సీట్లను సాధించడం పాటు జాతీయస్థాయి క్రీడలో రాణించిన విద్యార్థులు ఇండియన్ ఆర్మీ ఎయిర్ ఫోర్సుల్లో ఉద్యోగాలు పొందడం విశేషం. విద్యతో పాటు విద్యార్థులకు మంచి మెనూ, ఇంటి వాతావరణం, తల్లిదండ్రుల వాత్సల్యాన్ని తలదన్నేలా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ కల్పిస్తున్నాడంతో ప్రస్తుతం మైనార్టీ విద్యార్థులు వైపు టేమ్రిస్ వైపు మలుతోంది.

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబ్నగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 8 బాలుర 8 బాలికల పాఠశాలలు/ కళాశాలలో ఉన్నాయి. ఇందులో 5 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మైనార్టీ విద్యార్థులకు




80 శాతం నాన్ మైనార్టీ విద్యార్థులకు 20 శాతం సీట్లను కేటాయిస్తారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్ కల్పిస్తారు. నాన్ మైనార్టీ విద్యార్థులకు అధికారులు లక్కీ డిప్ ద్వారా సీట్లను కేటాయిస్తారు.

## అందుబాటులో అన్ని గ్రూపులు..

పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఎంఈసి, హెచ్ఇసి, గ్రూపులతోపాటు ఎంపీహెచ్డబ్ల్యు, ఎం.ఎల్.టి. లాంటి ఒకేషనల్ గ్రూపులు కూడా అందుబాటులో ఉన్నాయి. పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత ఇంటర్ స్థాయిలో రాష్ట్రస్థాయి ర్యాంకులను విద్యార్థులు సాధిస్తున్నారు.

## సదుపాయాలు..

**నాణ్యమైన విద్యను పాటు డిజిటల్ క్లాస్ రూమ్స్ , లైబ్రరీ, కంప్యూటర్ ట్రైనింగ్ అందుబాటులో ఉంటుంది రుచికరమైన, శుచికరమైన భోజనం, వసతి, నోట్ బుక్, టెక్స్ట్ బుక్, యూనిఫామ్, బెడ్ షీట్స్, వస్తువులు విద్యార్థులకు ఉచితంగా అందజేస్తారు. ఉదయాన్నే బూస్ట్, రాగి జావతో పాటు నెలలో రెండుసార్లు మాంసాహారం నాలుగు సార్లు చికెన్ ప్రతిరోజు పాలు, పండ్లు గుడ్లను విద్యార్థులకు ఇస్తారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం నర్సింగ్ ఆఫీసర్, క్రీడల్లో రాణించడానికి ప్రత్యేకంగా వ్యాయామ ఉపాధ్యాయుడు అందుబాటులో ఉంటారు. విద్యార్థుల సేఫ్ అండ్ సెక్యూరిటీని నిరంతరం సీసీ కెమెరా ద్వారా పర్యవేక్షిస్తారు.**



## ఒకేషనల్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..

**టేమ్రిస్ ఆధ్వర్యంలో సైన్స్ గ్రూపులతో పాటు ఉద్యోగ, ఉపాధి రంగాలలో రాణించేందుకు వీలుగా విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులను కూడా నిర్వహిస్తున్నారు. డోర్నకల్ లో బాలికలకు ఎం.పీ.హెచ్డ.బ్ల్యూ., ఎం .ఎల్ .టి. హనుమకొండలో బాలురకు ఎం.ఎల్.టి, ఎ.సి.పి. ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉంటాయి. కోర్సులు పూర్తి చేసిన వారికి జాబ్ మేళాలు నిర్వహించి అప్రెంటిషిప్ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఇది విద్యార్థుల సాధికారతకు ఎంతగానో తోడ్పడుతుంది.**



## ఈ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనవి

**సెక్రెటరీ షఫీ ఉల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టేమ్రిస్ విద్యాసంస్థల్లో అన్ని వసతులు, అద్భుత ఫలితాలు ప్రతియేట వస్తున్నాయి. ఇప్పటికే ఆన్లైన్ ద్వారా అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.**

*– డాక్టర్ సతీష్ జంగా, రీజనల్ లెవెల్ కోఆర్డినేటర్, ఉమ్మడి వరంగల్ జిల్లా*



## బంగారు బాటలు వేసుకోండి

**మైనార్టీ విద్యార్థులు నాణ్యమైన విద్య పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా టేమ్రిస్ విద్యాసంస్థలు కార్యచరణ కార్యక్రమాన్ని రూపొందించాయి. ఎలాంటి సందేహం లేకుండా టేమ్రిస్ విద్యా సంస్థలో అడ్మిషన్లు పొంది మీ జీవితాలకు బంగారు బాట వేసుకోవాలి.**

*- షఫీ ఉల్లా, సెక్రటరీ, టేమ్రిస్ హైదరాబాద్*



## పోటీ పరీక్షలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

విద్యార్థులకు జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షల కోసం వరంగల్ (గర్ల్స్2) బాలికల పాఠశాల/కళాశాల (యూనివర్సిటీ క్రాస్ రోడ్) లో విద్యార్థులకు సీఓఈ లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మెడిసిన్, ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు పొంది పొందడం విశేషం.

**సీట్లు :** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలో ముస్లిం మైనార్టీ విద్యార్థులకు 5వ తరగతిలో 930 సీట్లు అందుబాటులో ఉండగా నాన్ మైనార్టీ విద్యార్థులకు 310 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక ఇంటర్ మొదటి సంవత్సరం గాను మైనార్టీ విద్యార్థులకు 939 సీట్లు, నాన్ మైనార్టీ విద్యార్థులకు 311 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**